క్లుప్తంగా

పాలిథిన్ నిర్మూలనకు సహకరించాలి



స్వాధీనం చేసుకున్న పాలిథిన్ కవర్లతో పంచాయతీ కార్యదర్శి సింహాచలం

ముంచంగిపుట్టు: ప్లాస్టిక్ కవర్లు నిషేధానికి అందరూ సహకరించాలని పంచాయతీ కార్యదర్శి సింహాచలం అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరుగుతున్న వారపు సంతలో అమ్మకానికి తెచ్చిన ప్లాస్టిక్ కవర్లను అధికారులు పట్టుకొని, స్వాధీనం చేసుకున్నారు. పాలిథిన్ కవర్లున్న వ్యాపారులకు జరిమానా విధించారు. ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణకు ముప్పు వాటిల్లుతుందని, గోనె సంచులు వాడాలని, ప్లాస్టిక్ నివారణ అందరి బాధ్యతని, వ్యాపారులు, కొనుగోలుదారులు అధికారులకు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి సింహాచలం అన్నారు.

రహదారి పరిశీలన



పాడైన రహదారిని పరిశీలిస్తున్న ఎంపీడీవో ధర్మారావు, గిరిజన సంఘం అధ్యక్షుడు శ్రీను

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి దారపల్లి గ్రామం మీదగా రాములు, వర్కుగుమ్మి, గడ్డిబంధ గ్రామాలకు వెళ్లే రహదారి పరిస్థితిని గిరిజన సంఘం నాయకులు ఎంపీడీవో ధర్మారావు దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం రాముల రహదారిని ఎంపీడీవో పరిశీలించారు. రాళ్లు తేలిపోయి, రెండు చోట్ల కల్వర్టులు కుంగిపోవడంతో ఆ ప్రాంత గిరిజనులు రాకపోకలకు పడుతున్న ఇబ్బందులను గమనించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ధర్మారావు మాట్లాడుతూ ముంచంగిపుట్టు నుంచి రాములు వెళ్లే మార్గంలో గోతులను తాత్కాలిక మట్టితో పూడ్చి రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, నూతన రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. గిరిజన సంఘం మండల అధ్యక్షుడు శ్రీను, పంచాయతీ కార్యదర్శి సింహాచలం, పీసా కమిటీ నాయకులు నారాయణ, జయరాంలు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన



రైతులకు ఆర్‌డీఎస్ విత్తన కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

పాడేరు రూరల్: మండలంలో డి.గొందురు, రాములపుట్టు, గ్రామాల్లో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అనంతరం రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.జె.వి.రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రతి రైతు నూతన ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్‌డీఎస్ విధానంతో భూమి మరింత సారవంతంగా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించే పంటలను మరింత ఆరోగ్యనిస్తుందన్నారు. నూతన విధానాలతోనే వ్యవసాయ పంటలు మరింత సాగుబడి వస్తుందన్నారు. అనంతరం రైతులకు 300 ఆర్‌డీఎస్ కిట్లు పంపిణీ చేశారు. సిబ్బంది బాబాజీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా చెకుముకి టాలెంట్ పరీక్ష



టేకులబోరులో చెకుముకి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కూనవరం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ పరీక్షలు విజయవంతమైనట్టు అల్లూరి జిల్లా-2 ప్రధాన కార్యదర్శి పాయం కన్నారావు తెలిపారు. చింతూరు డివిజన్ పరిధిలోని 26 పాఠశాలలకు సంబంధించి 8, 9, 10 తరగతుల విద్యార్థుల నాలుగు మండలాల నుంచి 1470 పాల్గొన్నట్టు తెలిపారు. కూనవరం మండలంలో 8 పాఠశాలల నుంచి 420 మంది విద్యార్థులు, వి.ఆర్.పురం మండలంలో 5 పాఠశాలల నుంచి 300, చింతూరు మండలంలో 10 పాఠశాలల నుంచి 600 మంది, ఎటపాకలో 3 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష పోటీలో పాల్గొన్నట్టు తెలిపారు. పోటీల్లో ఎంపికైన విద్యార్థులు నవంబర్ 1న మండలస్థాయి పోటీ పరీక్షలకు అర్హత సాధించినట్టు చెప్పారు.

కేవీకేలో అందుబాటులో చేప పిల్లలు

రంపచోడవరం: పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో చేప పిల్లలు విక్రయానికి అందుబాటులో ఉన్నట్టు కె.వి.కె.శాస్త్రవేత్త జె వీరాంజనేయులు తెలిపారు. రెండు నుంచి మూడు అంగుళాల సైజు చేప పిల్లలను విక్రయిస్తున్నట్టు తెలిపారు. ఒక్కో చేప పిల్ల రూ.2లకు విక్రయిస్తున్నట్టు తెలిపారు. అవసరమైన రైతులు 9553364265కు సంప్రదించాలన్నారు.

ఇంకెన్నాళ్లీ వెతలు?

- కిర్రాబు ఆనకట్ట అందని ద్రాక్షేనే
- సాగునీటి కోసం తప్పని పాట్లు



మడేరు వాగుపై నిర్మించాల్సిన కిర్రాబు ఆనకట్ట ప్రదేశం ఇదే

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం మీదుగా ఎడతెకక పారే మడేరు ఏరుపై సాగునీటి వనరు నిర్మించాలని దాదాపు అర్ధశతాబ్దంగా ఇక్కడి గిరిజన రైతులు చేస్తున్న ఆందోళనలు అరణ్యరోదనే అవుతున్నాయి. జీవనది మడేరు వాగుపై కిర్రాబు వద్ద ఆనకట్ట నిర్మించాలని, అప్పుడే తమ గ్రామాల్లోకి అడుగుపెట్టాలని రైతులు ఎన్నో సార్లు ఆందోళలకు దిగిన సంగతి తెలిసిందే. వాస్తవానికి ఇక్కడ ఆనకట్ట నిర్మిస్తే కింద్ర, లాగరాయి, లబ్బర్తి, తంటికొండ, దూసరపాము పంచాయతీల్లోని సుమారు 11 గ్రామాలకు చెందిన దాదాపు 5వేల ఎకరాల మెట్టభూమికి సాగునీరు లభిస్తుంది. ఈ ప్రాంతం అంతా సస్యశ్యామలం అవుతుంది. వాస్తవానికి ఇక్కడ ఆనకట్ట నిర్మిస్తే రైతులకు ఎంతో ఉపయుక్తంగా వుంటుందని 1965లోనే గుర్తించడం జరిగింది. ఇన్నేళ్లు అవుతున్నా.. రైతులు ఎదురు చూపులు ఎదురు చూపులుగానే మిగిలిపోయాయి. అనేక సార్లు స్థానిక రైతాంగం కిర్రాబు ఆనకట్ట గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రంపచోడవరం ఐటీడీఏలో పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చారు. ఆనకట్ట నిర్మించి తీరాల్సిందేనని రైతులు అనేక సార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కిర్రాబు ఆనకట్టకు రూ.35 కోట్ల సబ్‌ప్లాన్ నిధులను కేటాయిస్తున్నట్టు అప్పట్లో ఐటీడీఏ అధికారులు ప్రకటించగా, అంచనా వ్యయం పెరగడంతో ఈ వ్యయాన్ని రూ.50 కోట్లకు పెంచినట్లు కూడా వార్తలు వచ్చాయి. తరరూ రైతులు కిర్రాబు ఆనకట్ట నిర్మించాలని డిమాండ్ పెరగడంతో దాదాపు పదేళ్ల క్రితం అప్పటి స్పెషల్ మైనర్ ఇరిగేషన్ డీఈ చెక్కా వెంకటనారాయణను ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. అందుకు సుమారు రూ.6 లక్షలు ఖర్చుచేసినట్లుగా అధికారుల చెబుతున్నారు. డిటైల్డ్ రిపోర్టును ఆనాడే ప్రభుత్వానికి నివేదించినట్టు డీఈ వెంకటనారాయణ తెలిపారు. ఈ ఆనకట్ట పంటకాలువ దాదాపు 11 కిలోమీటర్ల నిడివితో ఐదు పంచాయతీల్లోని 11 గ్రామాలలోని మెట్టపొలాలలకు సాగునీరు అందజేస్తుందని అధికారులు చెపుతు వస్తున్నారు. అయితే ఎన్నేళ్లయినా, ఎన్నాళ్లయినా కిర్రాబు ఆనకట్ట నిర్మాణం అందని ద్రాక్షగా మారిందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కిర్రాబు వద్ద ఆనకట్ట నిర్మించి పేద గిరిజన రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



మడేరు వాగుపై కిర్రాబు వద్ద ఆనకట్ట నిర్మిస్తే వ్యవసాయం గిట్టుబాటు కాక అణగారి ఉన్న ఈ ప్రాంత గిరిజన రైతాంగానికి ఎన్నో మేళ్లు చేకూరుతాయి.ఎన్నో ఏళ్ళగా బీడువారి వున్న మెట్ట పొలాలు సస్యశ్యామలం అవుతాయి. సమస్యపై అధికారులు స్పందించాలి.

– ఆదిరెడ్డి సత్యనారాయణ, రైతు, కింద్ర

పెరిగిన ధరలు.. తగ్గిన అమ్మకాలు

గ్రామాల్లో కానరాని దీపావళి సందడి



ముంచంగిపుట్టులో బాణసంచా దుకాణం

ముంచంగిపుట్టు: చీకటి చిదిమేసే వెలుగుల పండుగ దీపావళిపై ఈ ఏడాది ఆర్థిక భారం పడినట్టు ఉంది. దీపావళికి ముందుగానే కనిపించే హడావుడి గిరిజన గ్రామాల్లో కానరాలేదు. గతంలో వారంరోజులు ముందుగానే టపాసుల మోత మోగేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.భారీ వర్షాలతో పంటలు నాశనం కావడం, నిత్యావసర ధరలు ఆకాశం అంటడం, కూరగాయాలు కొనలేని పరిస్థితితో దీపావళి సందడి లేకుండా పోయింది. పర్యావరణ అధికారులు మాత్రము మాట్లాడుతూ పర్యావరణానికి హనిచేసే బాణసంచాకు దూరంగా ఉండడం మంచి దాని సూచిస్తున్నారు.గతం కన్న ఇప్పుడు బాణసంచా విక్రయాల షాపులను తగ్గించారు. షాపుల యజమానులకు పాటించాల్సిన నియమ నిబంధనలపై ముందస్తుగానే అవగాహన కల్పించారు. పర్యావరణహిత దీపావళియే మేలు అని, దీపాలు వెలుగుతో చేసుకోవడం ఉత్తమం అని పర్యావరణ పరిరక్షణ అధికారులు కోరుతున్నారు. నివాసాల మధ్య భద్రత లేని ప్రాంతాల్లో ఇష్టానుసారంగా టపాసులు విక్రయించొద్దని, తగు జాగ్రత్తలు తీసుకుంటూ, నిబంధనలు పాటిస్తూ దీపావళి పండుగ జరుపుకోవాలని.ప్రతి బాణసంచా దుకాణం వద్ద భద్రత ప్రమాణాలు పాటించాలని సూచిస్తున్నారు. దుకాణాల వద్ద తప్పనిసరిగా ఇసుక, నీరు బకెట్లతో ఉంచుకోవాలని రెవెన్యూ, పంచాయతీ, అగ్నిమాపక, పోలీసు శాఖల అధికారులు ప్రజలను కోరుతున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం




పాకలపాటి గురుదేవులు విగ్రహం, ఆలయ సన్నిధిలో భక్తులకు జ్ఞాపికలు అందజేస్తున్న మాజీ మంత్రి బాలరాజు, మాజీ ఎంపీపీ వెంకట గంగరాజు తదితరులు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని రామాలయం సన్నిధిలో పాకలపాటి వెంకటరామ యోగేంద్రులు (పాకలపాటి గురుదేవులు) ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం మాజీ మంత్రి, గురుదేవుల ఆలయ ధర్మకర్త మత్స్యరాస బాలరాజు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. మండలంలో పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గురువుల భక్తులు నామకీర్తన హరిభజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండలంలో 17 పంచాయతీల నుంచి వచ్చిన పలు ఆలయాల్లో పనిచేస్తున్న 200 మంది అర్చకులకు శాలువలు కప్పి సన్మానించి, పాకలపాటి గురుదేవుల ఫోటోలతో కూడిన జ్ఞాపికలను ఆయన అందజేశారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు మత్స్యరాస వెంకటగంగరాజు (బుజ్జి), సర్పంచ్ రాంబాబు, సొలభం సర్పంచ్ ఐసరం హనుమంతరావు, ఎస్‌ఎస్‌ఎఫ్ జిల్లా ప్రముఖ్ మత్స్యరాస మత్స్యరాజు, విజయసాయి ఆలయ ధర్మకర్త కిముడు వెంకటరమణ, విశ్వహిందూ పరిషత్ జిల్లా ధర్మప్రచార ప్రముఖ్ రీమలి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వలసయ్య, వర్తక సంఘం నాయకులు బొజ్జా అర్జునరావు, వానపల్లి కృష్ణ, మోదుగులమ్మ తల్లి ఆలయ పూజారి సన్యాసిరావు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



జీకే వీధి సీఐ వరప్రసాద్



చింతపల్లి సీఐ వినోద్‌బాబు

గూడెంకొత్తవీధి: అనుమతులు లేకుండా దీపావళి బాణాసంచా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జీకే వీధి సీఐ వర ప్రసాద్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాణసంచా విక్రయ వ్యాపారులు విధిగా అన్ని శాఖల నుంచి అనుమతులు తసుకోవాలని సూచించారు. బాణాసంచాను కూడా ఎలాంటి ఇబ్బందులు లేని స్థలాల్లో విక్రయించాలన్నారు.

చింతపల్లి: మండలంలోని బాణాసంచా సరకుల అమ్మకాలకు అనుమతులు విధిగా తీసుకోవాలని సీఐ వినోద్‌బాబు అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తున్న వారు ఖచ్చితంగా లైసెన్సు పొంది ఉండాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. గ్రామానికి 50 మీటర్లు దూరంలో ఏర్పాటుచేసుకోవాలన్నారు. దుకాణాల వద్ద బకెట్లుతో మంచి నీరు, ఇసుక వంటివి ఉంచాలన్నారు.

గంగవరం: నిబంధనల మేరకు బాణసంచా విక్రయించాలని గంగవరం తహసీల్దార్ సీహెచ్. శ్రీనివాస్, ఎస్‌ఐ బి.వెంకటేష్ దుకాణదారులకు సూచించారు. గంగవరంలో ఏర్పాటు చేయనున్న బాణసంచా దుకాణాల స్థలాలను వారు శనివారం పరిశీలించి వ్యాపారులకు పలు సూచనలు చేశారు. నిబంధనలు విధిగా పాటించాలని, అగ్ని మాపక శాఖ సూచనల మేరకు ముందస్తు జాగ్రత్త పాటించాలని సూచించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, ఏఎస్‌ఐ మహర్షి, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాసులమ్మ మృతికి ఎమ్మెల్యే సంతాపం



చింతపల్లిలో కాసులమ్మ మృతదేహం వద్ద నివాళలర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి: మండల కేంద్రంలో మన్యవాసి గాస్పెల్ ఫిలోషిప్ వ్యవస్థాపకుడు పాతుని డేవిడ్ రాజ్ భార్య కాసులమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు శనివారం గ్రామానికి చేరుకుని కాసులమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతురాలి కుటుంబాన్ని ఓదార్చి సానుభూతిని వ్యక్తం చేశారు.మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సీభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్, మండల సర్పంచ్‌లు ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు పాంగి గణబాబు, క్రిష్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు వసపరి తిమోతి, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు, నాయకులు గంగన్నపడాల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

23న మెగా జాబ్‌మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోటవురట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 23న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సు కలిగిన నిరుద్యోగులు హాజరు కావాలన్నారు. 18 కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు, జెరాక్స్ కాపీలను వెంట తీసుకుని రావాలన్నారు. వివరాలకు 8247505171 నంబరును సంప్రదించాలని కోరారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



జబడలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ త్రినాథ్, నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ జబడ గ్రామంలో నూతన సీసీ రోడ్డు పనులకు శనివారం సర్పంచ్ త్రినాథ్, నేతలు ప్రత్యేక పూజలు చేసి, శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ వర్షాకాలంలో జబడ గ్రామంలో వీధులన్ని బురదమయంగా మారి రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5లక్షలతో 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి కేటాయించినట్టు చెప్పారు. సీసీ రోడ్డును నాణ్యతగా కాంట్రాక్టర్ నిర్మించాలన్నారు. సీసీ రోడ్డు మంజూరుతో జబడ గ్రామ గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సాధురాం, ఉప సర్పంచ్ సత్యం, వార్డు, పీసా కమిటీల సభ్యులు సోద, గణపతి స్థానికులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



క్రీడాకారులతో జిల్లా ఎస్‌జీఎఫ్ క్రీడా కార్యదర్శి పాంగి సూరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు

పాడేరు రూరల్: జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఎస్‌జీఎఫ్ డివిజన్‌స్థాయి అండర్ -14, 17 బాలుర, బాలికల క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతు 11 మండలాల నుంచి 670 మంది విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో పాల్గొన్నట్టు తెలిపారు. అనంతరం ఎస్‌జీఎఫ్ జిల్లా క్రీడా కార్యదర్శి పాంగి సూరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంపై కూడా ఆసక్తి చూపించాలన్నారు. రెండో రోజు జరిగిన వివిధ క్రీడల్లో ఖోఖో, యోగా పోటీల్లో క్రీడాకారులకు ఎంపిక చేశామన్నారు. త్వరలో నిర్వహించే వివిధ స్థాయి క్రీడా పోటీలో మరికొంత మంది విద్యార్థులు పాల్గొన్నట్టు చెప్పారు. క్రీడల్లో రాణించాలని కోరారు. వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి భూపతిరాజు, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కొండబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు చందర్‌రావు, పద్మ, రాజులమ్మ, ప్రియాంక పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ
- తరలివచ్చిన పార్టీ శ్రేణులు



సొవ్వాలో కోటి సంతకాల సేకరణ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఈశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పరశురామ్

డుంబ్రిగుడ: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మండలంలోని సొవ్వా పంచాయతీ దేముడువలసలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతకాల శిబిరాన్ని ఎంపీపీ బాకా ఈశ్వరి ప్రారంభించి తొలి సంతకం చేశారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పరశురామ్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపడుతున్న రచ్చబండ, కోటి సంతకాల సేకరణకు ప్రజా ఉద్యమంతో సాధ్యపడుతుందన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ యోచనను కూటమి ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సొవ్వా మాజీ సర్పంచ్ పి.రాంప్రసాద్, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు బాకా తిరుమలరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఒరబోయిన సుబ్బారావు, పార్టీ మండల కార్యదర్శి రామునాయుడు, నాయకులు సింహాచలం, నరసింగరావు పాల్గొన్నారు.

హుకుంపేట: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటికరణకు వ్యతిరేకంగా అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మండలంలోని గూడా, మఠం ప్రాంతాల్లో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ శ్రేణులు రచ్చబండ కోటి సంతకాల సేకరణ కరపత్రాలు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు అనిల్, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తోందని, ప్రజలందరు గమనిస్తున్నారన్నారు. త్వరలో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని తెలిపారు. నాయకులు వెంకట్, కోటిబాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



వంజరిలో హైవే నిర్మాణంలో రైతులు కోల్పోయిన భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

జి.మాడుగుల: మండలంలో రెవెన్యూ పరంగా గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు,పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్టు తహసీల్దార్ జి.రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలో వంజరి, గెమ్మెలి, పంచాయతీల్లో పలు గ్రామాల్లో శనివారం తహసీల్దార్ విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, ఇబ్బందులు రెవెన్యూ సమస్యలలు గూర్చి ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యల్లో కొన్ని రెవెన్యూపరమైన ఆయన అక్కడికక్కడే పరిష్కరించారు. గ్రామాల్లో కొంతమంది గిరిజనులు దరఖాస్తులు, వినతిపత్రాలు ద్వారా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించకపోవడం వంటి కారణాలు భూ సమస్యలపై రైతులను ఆయన వాకబు చేశారు. హైవే రోడ్డు అధికారులకు భూములు బాధిత రైతుల సమస్యలను ఆయన వివరించారు. రోడ్డు నిర్మాణంలో భూ బాధితులకు త్వరలోనే నష్టపరిహారం బ్యాంకు ఖాతాల్లో జమవుతుందని ఆయన భరోసా కల్పించారు. మండలంలో గిరిజన గ్రామాల్లో ప్రజల సమస్యలు, ఇబ్బందులుంటే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే మీ కోసం కార్యక్రమంలో దరఖాస్తులు, వినతులు అందిస్తే కొద్ది రోజుల్లోనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ సిబ్బంది, హైవే రోడ్డు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు



రాజవొమ్మంగి తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు



డుంబ్రిగుడ తహసీల్దార్ త్రివేణికి వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు



ముంచంగిపుట్టులో ఆర్‌ఐకు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు



రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పాత్రికేయులు

ముంచంగిపుట్టు: జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం, పత్రికా స్వేచ్ఛను హరించడం తగదని ముంచంగిపుట్టు ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ఆర్.నాగభూషణం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రెస్ క్లబ్ ప్రతినిధులు శనివారం నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిను విచారణ పేరుతో వేధించడం, సాక్షి పత్రిక జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. సాక్షిపై కక్షసాధింపు చేయడం ,భావ ప్రకటన స్వేచ్ఛకు తూట్లు పొడవడమేనని, తక్షణమే పాత్రికేయులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. పాత్రికేయులు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, పులిరాజు, శంకర్‌రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వాస్తవాలతో ప్రచురితం చేస్తున్న సాక్షిపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు చేపట్టడం తగదని పలువురు పాత్రికేయులు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిను విచారణ పేరుతో వేధించడం తగదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలని కోరారు. పాత్రికేయులు ప్రసాద్‌రావు, శెట్టి గోపాల్, కోటేశ్వరరావు, అర్జున్, నవసూర్య, సాంబమూర్తి పాల్గొన్నారు.

రంపచోడవరం: 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిను, నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జిలను వేధింపులకు గురి చేసేలా పోలీసులు కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ రంపచడవరంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట పాత్రికేయులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ శుభం నొఖ్వాల్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సాక్షిపత్రికపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. సాక్షి ఎటిటర్ ఆర్.ధనంజయరెడ్డితో పాటు పాత్రికేయులపై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాత్రికేయులు జి.వి.నారాయణరావు, బి.సత్యనారాయణమూర్తి, పి.రాంబాబు, డి.వి.కిరణ్, డి శ్రీను, పి.పద్మరాజు, మారుతి, భద్రం, మణికంఠ, పాలబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, పత్రిక విలేకరులపై కూటమి ప్రభుత్వం కక్షపూరిత చర్యలకు పాల్పడుతోందని, దీనిని అందరం ముక్కుమ్మడిగా ఖండిస్తున్నామంటూ శనివారం రాజవొమ్మంగిలోని పాత్రికేయులు గళమెత్తారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పాత్రికేయులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు రామరాజు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సూరిబాబు, సభ్యులు శ్రీనివాస్, ఉదయభాను, వినయ్, వీర్రాజు, టామ్ పాల్గొన్నారు.